# యు. జి. కృష్ణమూర్తి గురించి



(తెలుగు అనువాదం : జె.ఎస్.సుబ్రహ్మణ్యం)

# కృతజ్ఞలు

ఇది అనువదించడంలో

అవసరమైన సలహాలను సవరణలు నాకందించి అన్ని విధాల సహాయ సహకారాలనందించి

నన్ను ఎంతగానో ప్రోత్సహించిన,

యు.జి. కృష్ణమూర్తి గారి మిత్రులు - Dr. J.S.R.L. నారాయణమూర్తి (కేలిఫోర్నియా, USA) గారికీ, కొర్లిమర్ల చంద్రశేఖర్ (బెంగుళూరు) గారికీ, సంకలన కర్తలు Anthony Nahas గారికీ,

ముకుందరావు గారికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

# యు. జి. కృష్ణమూర్తి గురించి

## (అనువాదం: జె.ఎస్. సుబ్రహ్మణ్యం)

ఇంగ్లీష్ మూలం:

ABOUT U.G. KRISHNAMURTI

(www.ugkrishnamurti.net)

----------------

# విషయ సూచిక

కృతజ్ఞలు ........................................................................................ 2

యు. జి. కృష్ణమూర్తి గారి గురించి ................................................................ 8

చివరి రోజులు ..................................................................................... 15

యూజీ  చెప్పినది........................................................................................ 29

ఉన్నది ఉన్నట్టుగా అన్నది........................................................................ 39

నా చివరి పాట........................................................................................ 42

అనువాదకుని మాట ................................................................................ 57







# యు. జి. కృష్ణమూర్తి గారి గురించి

(తెలుగు అనువాదం : జె.ఎస్.సుబ్రహ్మణ్యం)

ఇంగ్లీష్ మూలం

(http://www.ugkrishnamurti.net)

- మొదటిసారి నిజ జీవితాన్ని (సహజ దైహిక జీవనాన్ని) స్పృశించే ధైర్యం నీలో కలిగితే, అది ఏ ఘటన వల్ల సంభవించిందో నీకెప్పటికీ తెలియదు. మనిషి ఆలోచించినదీ, అనుభూతి చెందినదీ (felt), అనుభవించినదీ, అన్నీ పోయాయ్. ఆ స్తానంలోకి మరేదీ వచ్చి చేరలేదు.
- మోక్షం, విమోచన, విముక్తి, పరివర్తన, పేరేదైనా, ఏది కోరుకొన్నా దానర్థం ఒక్క క్షణకాలం గూడా దుఃఖంలేని సుఖం, బాధలు లేని సంతోషం, ఉండాలనుకోవడమే! రెండూ ఒకటే.

- భయాన్నుండి బయట పడాలని మనం కోరుకోం. మనం కోరుకునేదంతా దాంతో ఆటలాడుకోడం, దాన్నుండి ఎలా విముక్తి చెందాలి, అనే దానిపై మాట్లాడుకోవడం.
- నీలో పేరుగాఉన్న నీ 'నేను' ను కొనసాగించడానికి, ఆలోచనను నీవు ఎల్లవేళలా వాడుకోవడమే 'నీవు'. దీనికంటే నీలో మరొకటి ఏదీ లేదు.
- నీవు నీవులా కాకుండా మరోలా మారాలి అనే దిశలో ఆలోచనలు ఇకపై అసలు లేనపుడు నీతో నీకు ఘర్షణ ఉండదు.

---- యూజీ

------------------------------

మనస్సు ఒక అవాస్తవం (Mind is a Myth) అనే పుస్తకం మొదటి పేజిలో యు.జి. కృష్ణమూర్తి చేసిన తనయొక్క చట్ట బద్ధమైన హక్కును వదులుకొంటూ చేసిన క్రింది ప్రకటనను (disclaimer) చదివినపుడు, ఆయనలో ఏదో ఒక ప్రత్యేకత ఉన్నట్టు మనకు తెలుస్తుంది:

నా బోధనకి, నా టీచింగుకి (యీ పదాన్నే మీరు వాడదలచు కుంటే), కాపీరైట్ లేదు. మీరు స్వేచ్ఛగా కాపీ చేసుకోవచ్చు, పంచిపెట్టచ్చు, అనువదించచ్చు, అర్థం వివరించ వచ్చు, అపార్థం చేసుకోవచ్చు, వక్రీకరించ వచ్చు, అస్తవ్యస్తం చెయ్యచ్చు, మీకిష్టమైనట్టు మీరు చేసుకోవచ్చు. అంతేకాదు, నా అంగీకారం గాని లేదా, మరెవ్వరి అనుమతి లేకుండానే గ్రంథకర్తృత్వం క్లెయిమ్ చేసుకోవచ్చు. -- యూజీ

ఎవరికీ హాని కలిగించని యీ పరిచయ వాక్యాలు మనలో ఒక చిత్రమైన చిరునవ్వు కలిగిస్తాయ్. కాని యిది, తర్వాత రాబోయేదాన్ని ఎదుర్కోడానికి పాఠకులను అసలు సిద్ధంచేయదు. యూజీ గురించి చదవడమంటే ఒక ఆధ్యాత్మిక తీవ్రవాదితో పరిచయం చేసుకోవడం లాంటిది. దేవుడు, మనస్సు, ఆత్మ, జ్ఞానోదయం, మానవత్వం, హృదయం, ప్రేమ, మానవ సంబంధాలు, లాంటి మన సాధారణ నమ్మకాలన్నిటినీ ఆయన తల్లకిందులు

చేసేస్తాడు. అంతే కాదు, మనమేమిటో మనకు కొత్త కోణాల్లో చూపిస్తాడు. దాని ఫలితం మెదడులో ఒక మెగా బాంబ్!

ఈ వింత వ్యక్తి, తనని కలసిన ప్రతి ఒక్కరి మనసులో అనిర్వచనీయమైన, ఒక చెరగని, ముద్ర వేస్తాడు. యూజీతో జరిగిన కొద్దిపాటి సంభాషణ, తమ గుండెలను కుదిపివేసేదని కొందరూ, అనూహ్యమైన ఆసక్తిని కలిగించేదని మరికొందరు చెప్పేవారు.

ఆశ, ప్రేమ, ముక్తి, శాంతి.., అడగండి ఏదైనా యిస్తా... అనడు యూజీ! అంతే కాదు, ఆయన మాటలు, ఇటువంటి భావాలను ఛిన్నాభిన్నం చేస్తాయ్. యూజీ తనను చూసేందుకు వచ్చేవారిని, రావద్దని చెప్పేవాడు. అనేక సార్లు, వచ్చినవారిని మర్యాదగా వెనక్కు పంపేసేవాడు. ఐనప్పటికి ఆయన, అందరు ఎక్కువగా చెప్పుకునే భారతీయ తాత్వికుడు. అంతేకాదు, పెంగ్విన్ ఇండియా చే ఇటీవల ప్రచురింపబడ్డ ఆయన "*జీవిత చరిత్ర*", ఎక్కువగా అమ్ముడైన పుస్తకాల లిస్టులో, గత తొమ్మిది నెలల నుండి, అగ్రస్థానంలో ఉంది.

మానవాళికి ఇవ్వడానికి తన వద్ద ఏ సందేశాలూ లేవని యూజీ ఎప్పుడూ చెప్పేవాడు. కాని ఆయన దగ్గరకొచ్చేవారు మాత్రం అలా అనుకొనేవారు కారు. తనదైన స్టైల్లో చేసే యూజీ ప్రసంగం వినడానికి ప్రపంచం నలుమూలల నుండి వేలాదిమంది ప్రజలు

వస్తుండేవారు. కాని ఇంత మందిని సమర్థించడం తేలికయిన విషయం కాదు. ఎందువలనంటే, యూజీ  ఏ రకమైన మీటింగ్స్ ఏర్పాటు చెయ్యడు;  ఉపన్యాసాలు ఇవ్వడు;  కోర్సులు ఆఫర్ చేయడు; ఏ పద్ధతులు ప్రతిపాదించడు; మంత్రాలు  వల్లించడు. ఆయన ఏ సంస్థనూ  స్థాపించలేదు. ఆయనకు ఆఫీసు లేదు, సెక్రటరీ లేడు,  ఫోన్ నంబర్ లేదు, ఫేక్స్ లేదు, పర్మనెంట్ అడ్రెస్ లేదు. వ్యాపించే కీర్తిలా యూజీ  అన్ని చోట్లా కనపడతాడు, కానీ ఒకే చోట ఉండడు! యూజీ  తన స్నేహితుల యిళ్లలో గాని, చిన్న చిన్న అద్దె ఇళ్ళలో గాని ఉండేవాడు.

సేన్ ఫ్రేన్ సిస్కో, న్యూయార్క్, లండన్, బోంబే, బెంగుళూరు, సిడ్నీ, ఔక్ లేండ్, లేదా బీజింగ్,  ఎక్కడైనా సరే యూజీ  ఊర్లోకి వచ్చాడన్న వార్త వ్యాపించగానే, ఆయన ఎక్కడ బసచేసేది తెలుసుకొనేందుకు ప్రత్నించే ప్రజలకంటే ఓ అడుగు ముందుంటాడు. ఓ చిన్న పది పౌండ్స్ సూట్ కేస్ లో పట్టే వస్తువులు తప్ప మరే యితర సామాన్లు ఆయనకి లేవు. సాధారణ దుస్తులు ధరిస్తాడు, సామాన్య మానవుడిలా జీవిస్తాడు. అయన ఏచోటా రెండు నెలలకన్నా ఎక్కువ ఉండడు. యూజీ  గురువుల కోవలో Howard Hughes లాంటివాడు. యూజీ  నిగూఢమైన, అనూహ్యామైన,

అసాధారనణ మేధా సంపత్తిగల, ఆకర్షనీయమైన వాడు, ఒంటరి స్వభావం గల వ్యక్తి.

తన వద్ద ఏ సిద్ధాంతాలు లేవని నొక్కి వక్కాణించే యిలాంటి ఏ తత్వవేత్త గూడా ఇంత జగత్ప్రఖ్యాతి కాలేదు. ప్రచారం అంటే ఎంతమాత్రం యిష్టం లేని యూజీ గురించి ప్రజలు ఎందుకు ఎక్కువగా మాటలాడుకొనే వారు? ఎప్పుడూ వేదికెక్కి ఉపన్యాసం ఇవ్వని వ్యక్తికి ఎందుకింత ప్రజాదరణ లభించింది? ఏ సంస్థను స్థాపించని గురువు ఎందుకు యింతగా ప్రచార మాధ్యమాలను ఆకట్టుకో గలిగేడు?

యూజీ భారత దేశానికి చెందిన అత్యంత వివాదాస్పద ఆధ్యాత్మిక గురువు. ఆయన ఏ వర్గానికి చెందిన వాడో చెప్పడం చాలా కష్టం. ఆయనను, గురువుల వ్యతిరేకి, గురువు కాని గురువు, పరిష్కారాలు చూపని యోగి, ఉరకలేసే ఉద్ధండ పండితుడు, తలంపులు తాకని తాత్వికుడు, (జిడ్డు) కృష్ణమూర్తి - వ్యతిరేకి అని పిలిచే వారు.

యూజీని ఎవరితోనైనా పోల్చ వలసివస్తే, ఆయన ఆధునిక-సోక్రటీస్ అనీ లేదా డయాజెనీస్ అనీ కొంత వరకు చెప్పచ్చు. యూజీ సోక్రటీసులా తన అభేద్యమైన తర్కంతో అందరిని మెప్పించి ఒప్పించే వాడు. కానీ, సొక్రటీస్ లా మీటింగ్స్ పెట్టి బోధలు, ప్రవచనాలు

చేయడు, అంతేకాదు యిలాంటి వాటిని గట్టిగా వ్యతిరేకించేవాడు. యూజీ ఎవ్వరినీ ఒప్పించటానికి, మార్చటానికి, ప్రభావితం చేయడానికి లేదా వాదించి జయించడానికి పయత్నించడు.

డయాజెనీస్ డబ్బు, దర్పం, పరువు, ప్రతిష్ట, అధికారం లాంటి వాటి జోలికి పోయేవాడుకాదు, యూజీ కూడా అంతే. కానీ, డియొజీన్స్ లో కనబడే అనాగరిత, అసభ్యత, వింత ప్రవృత్తి యూజీలో లేదు. నిజంగా, యిప్పటి వరకు భూమిపై జీవించిన ప్రతి గొప్ప యోగికి ఒక ప్రత్యేక చిహ్నమైన అంతుచిక్కని జ్ఞానానికి యూజీ ఒక ప్రత్యక్ష సాక్షి. ఈ యుగానికి అద్దం లాంటి అద్భుత సాక్షి.

-- ఆంథోని నేహాస్ (Anthony Nahas).

*****

ఇంగ్లీష్ మూలం: Anthony Nahas:

http://www.ugkrishnamurti.net )

--------------------



# చివరి రోజులు

# (యు.జి. కృష్ణమూర్తిని గుర్తుచేసు కొంటూ)

**(Remembering U.G. Krishnamurti)**

*ఇంగ్లీషు మూలం: ముకుందరావు*

*(తెలుగు అనువాదం: జె.ఎస్.సుబ్రహ్మణ్యం)*

యూజీ అని ప్రపంచ వ్యాప్తంగా ఉన్న మిత్రులు, అభిమానులచే ప్రేమగా పిలవబడ్డ, యు.జి. కృష్ణమూర్తి, యిక లేడు. 2007 మార్చ్ 22 న, మధ్యాన్నం 2.30 గంటలకు,

Vallecrosia, ఇటలీ లో ఆయన స్నేహితులు Lucia, Anita and Giovanni గార్ల బంగళా ఆవరణలో, ఆయనకై నిర్మించబడ్డ అపార్ట్ మెంటులో యూజీ తుది శ్వాశ విడిచేడు. యూజీ సలహా మేరకు ఏరకమైన ఉత్తరక్రియలు, కర్మకాండలు జరిపించకుండా, మరుసటి రోజు మధ్యాన్నం 2.45 గంటలకు Vallecrosia, ఇటలీలో ఆయన మృతదేహాన్ని దహనం చేసారు. అప్పటికాయనకు 88 ఏళ్లు. ఆయన మరణించే నాటికి, ఆయనకు మునుపటి కుటుంబ సభ్యులు, యిద్దరు కుమార్తెలు ఉష, భారతి & కొడుకు కుమార్ మరియూ వారి వారి కుటుంబం ఉన్నారు. నిజానికి, తన సొంత కుటుంబ సభ్యుల కన్నా, ప్రపంచమంతా వ్యాపించి, ఎక్కువ చేరువగా, ఆత్మీయులుగా వున్న, అనేక మిత్రులను కలుపుకుని చూస్తే, యూజీ అసలైన కుటుంబం చాలా పెద్దది.

ఏడు వారాల క్రితం, ఇంట్లో పడిపోయి నప్పుడు యూజీకి గాయాలు తగిలాయి. ఇలా జరగడం గడచిన రెండేళ్లలో రెండోసారి. ఇలాటి సంఘటనలు మరోసారి జరగడం యూజీకిష్టం లేదు. తన దైనందిక కార్యక్రమాలు జరుపుకోడానికి తన మిత్రులపై ఎక్కువగా ఆధారపడ్డం యూజీకిష్టం లేదు. అందువల్ల వైద్య సహాయాన్నిగాని, మరే యితర సహాయాన్నిగానీ యూజీ నిరాకరించాడు. తన దేహం

తనంతట తాను  సహజ రీతిలో మరణ స్తితికి పోయేందుకు వీలుగా దానిజోలికి పోకుండా ఉండడానికి యూజీ నిర్ణయించుకున్నాడు. యూజీ తన పడక గదికి పరిమితమయ్యాడు. ఆహారం, నీళ్లు తీసుకోడం క్రమంగా తగ్గి,  పూర్తిగా ఆగిపోయింది. తాను పోవాల్సిన సమయం ఆసన్నమైందని మిత్రులందరికి చెప్పి,  చేతులు జోడించి నమస్కరించి, ధన్యవాదాలు తెలియ జేసి,  యిక అందరు తమ తమ ఊళ్లకి వెళ్లి పోవాలని మిత్రులందరిని కోరేడు. ఆయన మృత దేహాన్ని పరిరక్షించించటానికి, తదుపరి  పనులు చేయడానికి, చిత్ర నిర్మాత మహేష్ భట్,  Larry, అండ్ సూసన్ మారిస్, మరి కొద్దిమంది చిరకాలమిత్రులు అక్కడే ఉండి పోయారు. యూజీ, cardio-spasm (హార్ట్ ప్రొబ్లెం) వలన చాలా సంవత్సరాలుగా బాధ పడ్డాడు. ఆయన చివరి రోజుల్లో అది తీవ్రమయింది. కాని యూజీ  ఏ రోగం వల్లా చనిపోలేదు. తన చివరిరోజుల్లో గూడా, మరణభయం గానీ, దేహచింతన గానీ, కొంచెం గూడా  యూజీ  ఎప్పుడూ ప్రదర్శించ లేదు. మరణానంతరం తన మృత దేహాన్ని ఏంచెయ్యాలో యూజీ చెప్పి వెళ్లలేదు. “నా అంత వరకు చెప్పాలంటే చెత్తకుప్ప మీద పడేయండి” అని తరచుగా అనే వాడు.

మరణం గురించిన ప్రశ్నలకు స్పందిస్తూ ఆయన అన్నాడు, "జీవన్మరణాలను (లైఫ్ అండ్ డెత్ లను) విడదీయలేం. మరణం సంభవించినపుడు, మృత దేహంలో ఉన్న మూలక ద్రవ్యాలు వీడి విడిగా విడి పోతాయ్. ఇది, జీవం కొనసాగడానికి ఆధార భూతమౌతుంది. ఈ అర్ధంలో దేహానికి చావు లేదు.

యూజీ 1918 జులై 9 న, మచిలీపట్టణం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో, తెలుగు బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు. ఏడు రోజుల పసివయసులో తన తల్లిని కోల్పోయాడు. ధనికుడు మరియు పేరొందిన అడ్వకేట్ అయిన, ఆయన తాత గారు (తల్లికి తండ్రి) యూజీని పెంచి పెద్దచేసేరు. ఆయన తాతగారు థియొసాఫికల్ సొసైటీలో (దివ్య జ్ఞాన సమాజంలో) ముఖ్య సదస్యుడు. సనాతన చాందస హిందూ సాంప్రదాయ వాతావరణంలో, వింతైన దివ్య జ్ఞాన సమాజ సాధనలు, ధ్యానాలు, మూఢ విశ్వాసాల మధ్య యూజీ పెరిగేడు. యూజీ చిన్న వయసులోనే అందర్నీ ఎదిరించి మాట్లాడే వాడు, కాని అతని చేతల్లో గట్టి నిజాయితీ ఉండేది. యూజీ గుడివాడ పాఠసాలలో చదివేడు. మద్రాస్ యునివర్సిటీలో, ఫిలాసఫీలో & సైకాలజీలో బి.ఎ ఆనర్స్ చేసేడు. తాను చదివిన అనేక తత్వశాస్త్ర సిద్ధాంతాలు, పురాణాలు, పాశ్చాత్య మానసిక శాస్త్రాలు యూజీపై

ఎక్కువ ప్రభావాన్ని చూపించలేదు. తన సైకాలజీ అధ్యాపకుడిని యూజీ ఓ సారి అడిగేడు "వీళ్లందరు మాట్లాడుతున్న యీ మనసు (మైండ్) ఎక్కడుంది?" అని. పూర్తిగా 20 సంవత్సరాల వయసుగూడా లేని ఒక విద్యార్థికి యీ ప్రశ్న ఉదయించడం ఒక అసాధారణ విషయం, ముఖ్యంగా 'మైండ్' మీద ఫ్రాయిడ్స్ యొక్క అభిప్రాయాలకి అత్యంత ప్రాధాన్యత వున్న ఆ రోజుల్లో.

యూజీ 14 నుండి 20 సంవత్సరాల వయసులో, ప్రతి సంవత్సరం కొంత కాలం, ఏడేళ్లు పాటు రుషీకేషులో స్వామి శివానందతో యోగసాధన చేసేడు. అక్కడ ఆయనకు వింత వింత మానసిక దృశ్యాలు, యోగానుభవాలు, అనుభూతులు కలిగేయి. కాని వాటి యదార్థతను యూజీ నమ్మలేదు, ఎందుకంటే.. యిదివరలో తానెరిగిన విషయాల ఆధారంతో మాత్రమే వాటిని గుర్తించ గలిగేనని ఆయనకి అనిపించినందువల్ల.

1939 లో 21 సంవత్సరాల వయసులో, యూజీ శ్రీ రమణ మహర్షిని కలసి, "మోక్షము అనేదాన్ని మీరు నాకు ఇవ్వగలరా" అని అడిగేడు. "నేనివ్వ గలను, కానీ నీవు తీసుకో గలవా" అన్న రమణ జవాబు యూజీపై ఒక పిడుగులా పడింది. అదే యూజీని నిరంతర

సత్య శోధన లోకి నెట్టింది. ఈ సత్యాన్వేషణ, ఊహించని పరిణామంతో ఆయన 49 వ ఏట సమాప్తమైంది.

మద్రాస్ విశ్వవిద్యాలయం విడిచిన తరువాత, యూజీ థియోసొఫికల్ సొసైటీలో లెక్చరర్ గా జేరేడు. దేశమంతా తిరిగి థియోసొఫీ (దివ్య జ్ఞానం) పై ఉపన్యాసాలిచ్చేడు. 1943 లో కుసుమ కుమారి అనే అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు. వివాహం తర్వాత కూడా, 1953 వరకు థియోసొఫికల్ సొసైటీ లోనే పనిచేస్తూ యూరోప్ దేశాల్లో ప్రసంగాలిచ్చేడు. కాని, ఈ వృత్తి తన ఆలోచనా విధానానికి ఏమాత్రం అనుగుణంగా లేనందున, విసిగి థియోసొఫికల్ సొసైటీ పదవిని ఒదిలేసాడు. ఆ తర్వాత జిడ్డు క్రిష్ణమూర్తి గారిని కలిసేడు. అప్పటికే జె. క్రిష్ణమూర్తి గారు ఒక విభిన్నమైన ఆధ్యాత్మిక గురువుగా పేరు సంపాదించేరు. రెండు ఏళ్ల పాటు, JK గారిని కలిసి నప్పుడల్లా ఆయనతో తీవ్ర వాగ్వాదానికి దిగేవాడు. ఆ తర్వాత JK గారి సిద్ధాంతాలన్ని అసత్య ప్రచార ప్రయాణాలంటూ పూర్తిగా కొట్టి పారేసాడు.

ఇదే సమయంలో, ఆయన జీవితాన్నే మార్చేసిన ఒక అనూహ్య అసాధారణ అనుభవం (mystical experience) ఆయనకు కలిగింది. దీన్ని ఆయన, ‘ఇది ఒక మరణానుభవం’ (death

experience) అని తరచుగా చెప్పే వాడు. కానీ, యూజీ దీనికి ఏ మాత్రం ప్రాముఖ్యతనీయలేదు. దీన్ని పట్టించుకో లేదు. తనకు కలిగిన ప్రతీ అనుభవాన్ని ప్రశ్నిస్తూ, పరీక్షిస్తూ, పరిశోధిస్తూ చివరికి తనదైన ఒక అవగాహనకు వచ్చాడు

1955 లో తన కమారుని పోలియో రోగ నివారణకు, కుటుంబ సమేతంగా యూజీ అమెరికా వెళ్లేడు. తన దగ్గరున్న డబ్బంతా కరిగిపోతున్న సమయంలో ఫీజు తీసుకొని ప్రసంగాలు (lectures) ఇచ్చేవాడు. ప్రపంచంలోని ముఖ్యమైన మతాల మీద, తత్వ శాస్త్రాల పైనా ఉపన్యాసాలు ఇచ్చి మంచి ఇండియన్ వక్తగా, అధ్యాపకుడిగా గుర్తింపబడ్డాడు. కానీ, యిదివరలో జరిగినట్టుగానే రెండో సంవత్సరం చివరిలో లెక్చరింగ్ పనిలో ఆసక్తి పూర్తిగా పోయింది, తరువాత ఆయన 17 సంవత్సరాల వైవాహిక జీవితం ముగిసి పోవడం అనివార్యమైనది. ఆయన భార్య, పిల్లలను తీసుకొని ఇండియా తిరిగి వెళ్లి పోయింది. యూజీ తెగిన గాలిపటంలా తిరిగేడు. గాలికి లేచిన ఎండుటాకులా గమ్యరహితంగా, లండన్ లో పేరిస్ లో అటూ యిటూ తిరిగి, చివరికి జెనీవా చేరుకున్నాడు. సానెన్ (Saanen) లో, వేలెంటేన్ డి కేర్వేన్ (Valentine de Kerven) అనే ఆమె ఇంట్లో ఆశ్రయం పొందేడు. అప్పటి నుండి నమ్మశక్యం గాని అనుభవాలు

యూజీకి కలగడం, శరీరంలో వరి-వూక కాలుతున్నట్టు అనిపించడం జరిగేది. ఇది, 1967 వ సంవత్సరం లో 49 వ పుట్టిన రోజున ఆయనకు భౌతిక మరణం (clinical death) సంభవించడానికి ప్రారంభ దశ. యూజీ శరీరంలో నమ్మశక్యంకాని మార్పులు, అనుభవాలు కలగడానికి ప్రారంభం యిదే. ఈ ఘటనలు, ఆధ్యాత్మిక యోగ సాధకులకు కూడా తెలియరాని, ఒక వినూత్న స్తితిలోకి యూజీని నెట్టివేసేయ్. ఏడు రోజుల వరకు ఆయన దేహంలో, విభ్రాంతి కలిగించే ఏడు భౌతిక మార్పులు చోటు చేసుకున్నాయ్. తర్వాత, ఆయన చెపుతున్న, 'సహజ స్తితి' (Natural State) లోకి అడుగు పెట్టేడు. అది ఒక జీవకణ విప్లవం! ఒక జీవ భౌతిక పరివర్తనం!

1972 లో, బెంగుళూరు లో జరిగిన ప్రపంచ సాంస్కృతిక భారతీయ సంస్థ సభలో, మొదటి సారిగా, ప్రజా వేదికపై ఆయన ప్రసంగం చేసాడు. దీని తర్వాత మరెప్పుడూ పబ్లిక్ ఉపన్యాసాలు యివ్వలేదు. కాని, తన దగ్గరకు వచ్చి తనతో మాట్లాడే వారిని ఆప లేదు. వారి సందేహాలకు బదులుగా, వారి ప్రశ్నలకు, మరెవ్వరూ ఇవ్వలేని విధంగా జవాబులిచ్చేవాడు. ఆయనెప్పుడూ, మిత్రులతోనో లేదా అద్దె ఇళ్లలోనో ఉండే వాడు, కాని ఒకే చోట ఆరు నెలల కంటే

ఎక్కువ, ఎప్పుడూ ఉండేవాడు కాదు. సంభాషణలు, ఉపన్యాసాలు ఆపేసేడు. ఆయనకి ఓ సంస్థ, ఆఫీసు, సెక్రటరీ, ఒకే చిరునామా లేదు. లోకానికివ్వడానికి తన వద్ద ఏ సందేశమూ లేదని ఆయన ఎన్ని సార్లు చెప్పినప్పటికీ, అలా అనుకోని, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వేలాది మంది ప్రజలు, ఆయన్ని కలవడానికి, ఆయన చెప్పే గురు-వ్యతిరేకత్వం వినడానికి వచ్చేవారు. విషయాలన్నీ, రోడ్నీ ఆమ్స్ (Rodney Arms) కూర్చి రాసి ఎడిట్ చేసిన మొదటి యూజీ పుస్తకం, *The Mystique of Enlightenment -- The Unrational Ideas of a Man Called UG* (జ్ఞానోదయ రహస్యం - యు.జి. అనే మనిషి నిర్హేతుక భావాలు) 1982 లో వచ్చింది. 1986 లో యూజీ ప్రజల ముందుకొచ్చి మొదటి టెలివిజన్ ఇంటర్ వ్యూ యిచ్చాడు. దీని తర్వాత ఆయన ప్రపంచమంతా చాలా టివి & రేడియో ఇంటర్ వ్యూలు యిచ్చేడు. "నా పుస్తకాలపై ఎటువంటి కాపీ రైట్ లేదు" అని యీ క్రింది విధంగా ప్రకటించి, ప్రచురణా చరిత్రలో కొత్త అధ్యాయాన్ని సృష్టించాడు.

> నా టీచింగ్ కి (ఈ పదాన్ని మీరు వాడదలచు కుంటే) కాపీ రైట్ లేదు. మీరు కాపీ చేస్కోవచ్చు, అందరికి పంచి పెట్టవచ్చు, అనువదించ వచ్చు, అర్థం చెప్పుకో వచ్చు, అపార్థం చేసుకోవచ్చు, వక్రీకరించ వచ్చు,

అస్తవ్యస్తం చెయ్యచ్చు. మీకిష్టమైనట్టు మీరు చేసుకోవచ్చు. అంతేకాదు... నా అంగీకారం గాని, మరెవ్వరి అనుమతి గాని లేకుండగనే 'దీనికి నేనే గ్రంథకర్తను' అని కూడా క్లైమ్ చేసుకొనవచ్చు.

చివరి ఏడేళ్లు, బెంగుళూరులో వున్నపుడు యూజీ సీరియస్ విషయాలపై చాలా తక్కువగా మాట్లడే వాడు. విసుగు పుట్టించే ప్రశ్నలూ జవాబులూ మానివేసి మరో పనేదైనా చేసేవాడు. ఎందుకంటే, సాంకేతిక రంగానికి సంబంధిచినవి తప్ప, మిగతా ప్రశ్నలన్నీ "ఉంటున్న స్తితి, మరియు మారాలనుకొంటున్న స్తితి" (being and becoming) అనే ఆలోచనల చుట్టూ తిరిగే ఒకే మూల ప్రశ్నకు రూపాంతరాలని, ఆయన తెలుసుకున్నాడు కాబట్టి. అక్కడ అప్పుడపుడు ఎక్కువ సేపు పూర్తిగా నిశ్శబ్దత ఆవరించుకొని ఉండేది. ఇది యిబ్బందికరంగా వున్నా 'తెలుసుకొనడం (knowing)' అనే పెద్ద బరువు నుండి గొప్ప ఉపశమనాన్నిచ్చేది. అపుడు యూజీ, మిత్రులతో చిన్న చిన్న పజిల్ గేమ్స్ ఆడేవాడు . లేదా ఆట పాటలు, జోక్స్ లాంటి వాటికి మిత్రులను ప్రోత్సహించేవాడు . నవ్వులతో సరదాలతో అరుపులతో గది దద్దరిల్లి పోయేది.

తలనొప్పి తెప్పించే యీ జ్ఞానం, అందం, మంచితనం, సత్యం, దేవుడు మొదలైన టాపిక్స్ వదలి, వీరులు, ప్రేమికులు,

ఆలోచనాపరులు, శాస్త్రజ్ఞులు, రాజకీయవేత్తలు, దొంగలు, రాజులు, మునులు అందరినీ, తనతోసహా మా అందరినీ గూడా ఎగతాళి చేసుకొంటూ, నవ్వుకుంటూ ఉండేవాళ్లం.

ఈ యూజీ ఎవరు? ఇతనేరకం మనిషి? ఇంతగా అంతుపట్టని, అర్ధంగాని మనిషిని మనమెప్పుడూ చూడం. ఒకే సమయంలో దయ, క్రూరత్వం, కరుణ, కాఠిన్యం చూపించడం; స్నేహితుల నుండి డబ్బు గుంజాలనే నటనతో చాలా సేపు డబ్బు గురించే మాట్లాడ్డం.. ఐనా ఔదార్యంగా అందరికి డబ్బులిచ్చేయడం; తిట్టినట్టు, శిక్షించినట్టూ కనపడడం, వెనువెంటనే దయార్ద్ర జల్లులు కురిపించడం; మరీ నిశ్చింతగా ఉండడం, ఎదుటి వారి గురించి చింత చూపడం; ఎదుటి వారికి నిర్దిష్ట మైన మార్గాలు చూపడం, జరిగిన దాన్ని తేలిగ్గా తీసుకోవడం... యివన్నీ యూజీ చేసేవాడు.

యూజీ నిశితమైన తన తర్కాన్ని ప్రదర్శిస్తాడు, తాను ముందు చెప్పినదానికి, పూర్తి విరుద్ధంగా మట్లాడతాడు. ఈ క్షణం జరుగుతున్న దాన్ని విడిచి మనం ఎప్పుడూ మరో ధ్యాసలో ఉంటాము అని విమర్శ చేస్తూనే, తన గురించి తన గత చరిత్ర గురించి ఆపు లేకుండా మాట్లాడేవాడు. యూజీ మాటలు, చేతలు, వెనుక ఉన్న ఉద్దేశ్యం, అంతరార్ధం ఎవ్వరూ కనిపెట్ట లేరు.

మన ప్రశ్నలకు ఆయన యిచ్చే జవాబులు, తిన్నగా వచ్చి బాణాల్లా తగిలి మన మనసుల్ని చెదరగొడతాయ్. మన మనసులో మనం జాగ్రత్తగా అందంగా కట్టుకున్న కోట గోడల్ని మాత్రమే కాకుండా మనిషి యొక్క ఆలోచనల పునాదులను పూర్తిగా కూల్చి వేయడంలో యూజీ మంచి పేరు ఉన్నవాడు. యూజీ నిజంగా అంతుచిక్కని, ఆవేశపూరితమైన, విప్లవాత్మకమైన మనిషి. పూర్తిగా నిర్భయుడు.

యూజీ మాటల్లో, ఆయన మౌనంలో ఒక ప్రత్యేకమైన శక్తి స్థిరంగా సచేతనంగా కనిపిస్తుంది. అది ఆయన చుట్టూ ఉన్న వారిని చాలా ప్రభావితం చేస్తుంది.

యూజీ గురించి యీ విషయాలు చెప్పాలి: ఆత్మ అస్తిత్వాన్ని యూజీ తోసిపుచ్చి, 'శాశ్వతత్వం కొరకు మనం చేసే అన్వేషణే మన బాధలన్నిటికి మూల కారణం' అని ఆయన ప్రకటించినపుడు, బుద్ధుడు మాట్లాడుతున్నాడా అనిపిస్తుంది; ఆధ్యాత్మిక ప్రభోదాలన్ని ఉత్త చెత్త, ఈ ఆధ్యాత్మిక గురువులందరు దారితప్పిన మూర్ఖులు అని యూజీ అందరినీ కడిగి పారేసినపుడు, తొమ్మిదో శతాబ్దపు గొప్ప చైనా యోగి Rinzai Gigen యొక్క ఘాటైన దూషణలు "నా దగ్గర మీకివ్వడానికి ఏ ధార్మికత లేదు. బుద్ధుడూ

లేడు, ధర్మమూ లేదు. సాధనా లేదు, జ్ఞానోదయం లేదు." అన్న మాటలు మాకు గుర్తుకొస్తాయ్.

"వాత్సల్యం (affection) అనేది మన శరీరం లోని థైమస్ గ్లేండ్ (thymus gland) ఉన్న చోట కలిగిన శబ్దాలు" అని యూజీ అన్నప్పుడు, " నిజమైన హృదయం మన ఛాతికి కుడి వైపు ఉంటుంది" అని చెప్పిన శ్రీ రమన మహర్షి మాటలతో మేము పోల్చు కున్నాం. అలాగే, యూజీ చేసే మూల సిద్ధాంత ప్రతిపాదనలు, అవధూత గీత, అష్టవక్ర గీత, ఉపనిషత్తులు మరియు జెన్ కోవన్స్ (Zen Koans) మొదలైన గ్రంధాలలో చెప్పిన మాటలవలే మాకు అనిపిస్తాయ్. లేదా జె. క్రిష్ణ మూర్తి, నిసర్గ దత్త మహరాజ్, అంతేకాక ఆధునిక భాషా విమర్శనా సిద్ధాంతులతో పోల్చి చూసేవాళ్లం. కాని యివన్ని యూజీ అనే మిస్టరీని ఛేధించడానికి ఉపకరించ లేదు.

యూజీ అనే అంతుచిక్కని మర్మయోగి యిక లేడు. రెండేళ్ల క్రితం హిందీ సినిమా నిర్మాత మహేష్ భట్ ఒకసారి యూజీని అడిగేరు, "మిమ్మల్ని ఏ విధంగా గుర్తుపెట్టు కోడానికి మీరు యిష్ట పడతారు?" అని.; యూజీ అన్నాడు, "నేను చనిపోయిన తర్వాత, నాదనేది ఏదీ, నీలోగాని నీ బయటగాని ఉండ కూడదు. నేను బతికి ఉండగా ఏ రకమైన సంస్థలూ, నా చుట్టూ తలెత్తకుండా నేను చూడ

గలను గాని,  మీ మెదడులో  నన్ను ప్రతిష్టించకుండా మీ అందరిని నేనెలా ఆపాలి?”

(http://www.ugkrishnamurti.net)

--------------------

# యూజీ చెప్పినది

## (Quotable Quotes)

### (తెలుగు అనువాదం-జె.ఎస్.సుబ్రహ్మణ్యం)

- బోధించడానికి నా దగ్గర ఏమీ లేదు. భద్ర పరచడానికి ఏమీ లేదు. బోధించడం అంటే, మార్పు తీసుకొని రావడానికి ఉపకరించేదనే అర్థం వస్తుంది. సారీ, మీరేమీ అనుకోవద్దు, యిక్కడ టీచింగేమీ లేదు, ఒకదానికొకటి కలవని కలపని పదాలు, వాక్యాలు తప్ప! ఉన్నదంతా మీ అనువాదమే, మీ వ్యాఖ్యానమే. ఇంకేంలేదు. ఈ కారణం వల్లనే, నేను చెపుతున్న వాటన్నిటికీ ఏ రకమైన కాపీరైట్ హక్కులూ, యిప్పుడూ లేవు, మున్ముందు కూడా ఉండవు. నాకే హక్కులూ, దావాలు, క్లైమ్స్ లేవ్.
- నా 'బోధన (teaching)' అనేది ఏదీలేదు, భవిష్యత్తులో గూడా ఉండదు. ( నేను చెప్పే) దానికి 'బోధించడం' అనే పదం వర్తించదు. టీచింగ్ అంటే... "ఒక పద్ధతి, ఒక వ్యవస్థ, ఓ ప్రక్రియ లేదా నీ జీవన విధానంలో మార్పు తీసుకు రావడానికి

ఉపయోగించే ఒక కొత్త ఆలోచనా విధానం" అనే అర్ధం వస్తుంది. నేను చెపుతున్నది, బోధనా క్షేత్రానికి బయట ఉన్నది, బోధింప బడలేనిది. నేను చెపుతున్నది కేవలం నేను నిర్వహిస్తున్న తీరుకు వివరణ మాత్రమే. ఇది మనిషి యొక్క సహజ స్తితికి (Natural State) వివరణ మాత్రమే, ....నీ ఆలోచన చేసే కుతంత్రాలు పక్కకు పెట్టి చూస్తే, నీవు నిర్వహిస్తున్న తీరు గూడ యిదే.

- నీవు నీ కాళ్లపై నిలబడి నడవగలవని నీకు చెప్పడమే నా అభిమతం. దయచేసి, దయచేసి మీ ఊత కర్రలన్నీ (crutches) విసిరి పారేయండి. నీవు నిజంగా వికలాంగుడవైతే ఎవరిపైనా ఆధారపడ వద్దని నేను సలహా యివ్వను. మీరు వికలాంగులని యితరులు మిమ్మల్ని నమ్మించారు, చేతికర్రల వంటి ఉపకరణాలను మీకు వారు అమ్ముకోవచ్చని. వాటిని బయటికి విసిరెయ్యండి, మీరు నడవవగలరు. నే చెప్పగలిగేదంతే. "నేను పడి పోతే...," అది మీ భయం. ఎవరి సాయం లేకుండా నడవండి, మీరు పడి పోరు.

- నేను జ్ఞానోదయం (enlightenment) పొందిన వాడినని ప్రజలు చెప్పుకుంటారు. ఈ పదాన్ని నేను అసహ్యించు కుంటాను -- నా వ్యవహార శైలిని వివరించి చెప్పడానికి, వాళ్లకి వేరే పదం దొరకలేదు. అంతేకాదు, అసలు జ్ఞానోదయమనేదే ఎక్కడా లేదని గట్టిగా చెప్తాను. నా జీవితమంతా జ్ఞానోదయం కొరకు వెదికి, జ్ఞానోదయం పొందడానికి ప్రత్నించి, చివరికి జ్ఞానోదయమనేదే ఎక్కడా లేదనే విషయం కనుక్కున్నాను. కాబట్టి ఒక మనిషి జ్ఞానోదయం పొందిన వాడా కాదా అనే ప్రశ్నే ఉదయించదు. నేను జ్ఞానోదయం పొందిన వాడను, అని చెప్పుకునే మన మధ్యలో ఉన్న వారిపైనే కాదు, ఆరవ శతాబ్దపు బుద్ధుడి విషయంలో గూడా నేనేమాత్రం ప్రాముఖ్యత నీయను, తనకు జ్ఞానోదయం వచ్చిందని చెప్పుకునే మన మధ్య ఉన్నవాళ్ల సంగతి యిక చెప్పక్కర లేదు, వీళ్లు అన్నీ తేలిగ్గా నమ్మే ప్రజల అమాయకత్వం మీద బతికే స్వార్థపరులు. మనిషికి బయట ఏరకమైన శక్తీ లేదు. మనిషే భయాన్నుండి దేవున్ని సృష్టించేడు. అందువలన భయమే మన సమస్య, దేవుడు కాదు.

- సహజ స్థితి అనేది ఆత్మజ్ఞాని లేదా దైవజ్ఞాని యొక్క స్థితి కాదు, ఇది సాధించేది కాదు, పొందేది కాదు, ఇది ఒక సంకల్ప సిద్ధి కాదు, ఇది ఉంది ~ ఇది జీవిస్తున్న స్తితి. ఈ స్తితి జీవన కార్య కలాపం మాత్రమే (functional activity of life). లైఫ్ (జీవం, జీవనం) అంటే అదేదో, నైరూప్యమైనది, అర్ధం కానిది (abstract thing) నేను చెప్పడం లేదు; ఇది, ఆలోచనల జోక్యం లేకుండా, సహజ రీతిలో తమ పనులను చేసుకొంటూ పోయే, జ్ఞానేంద్రియాల, ఇంద్రియాల జీవనం. ఆలోచనలు జ్ఞానేంద్రియాల సొంత వ్యవహారాల్లోకి అక్రమంగా దూరి, ఒత్తిడి చేసి వాటిని, సక్రమంగా పనిచేయకుండా చేస్తాయ్. ఆలోచనకు లాభాపేక్ష ఉంటుంది: ఆలోచన, జ్ఞానేంద్రియాల నుండి ఏదో పొండడానికి, అవి చేసే పనులను నిర్దేశిస్తుంది, అంతేగాక తాను కొనసాగడానికి వాటిని వాడుకొంటుంది.
- భగవంతుడు ఆఖరి సుఖం, అన్నిటినీ మించిన ఆనందం, నిరంతర నిత్య సంతోషం. అటువంటిది లేదు. లేనిదాన్ని కావాలనుకోవడమే నీ సమస్యకు మూల కారణం. పరివర్తన,

మోక్షం, విముక్తి మొదలైనవన్నీ "శాశ్వతానందం" అనే విషయానికి మారు పేర్లు.

- నీ అనుభవాలు, ధ్యానాలు, ప్రార్ధనలు, నువ్వు చేసేవన్నీ `నేను` చుట్టూ తిరిగే కార్య కలాపాలే. ఇది నేను (self) కు, మరింత బలాన్నిస్తోంది, మరింత ఊపును జోడిస్తోంది, అలా నిన్ను వ్యతిరేక దిశలో నడిపిస్తున్నాయ్. `నేను' నుండి విముక్తి చెందడానికి నువ్వేంచేసినా, అది గూడా 'నేను` అనేది చేయించే కార్యమే.
- అక్కడ ఏమీ లేదు, నీ సాపేక్షిక, అనుభవ వివరాలు మాత్రమే ఉన్నాయ్, అదే నీ సత్యం (నీకు తెలిసిన నిజం). బాహ్యావస్తు సత్యం (objective truth) అనేది లేనేలేదు. మన మనస్సుల బయట గానీ, మన మనస్సులతో సంబంధం లేనిది గానీ ఏదీ లేదు.
- మనస్సు గాని, ఆలోచనగాని నీదీ కాదు, నాదీ కాదు. అది అందరికీ చెందే మన వారసత్వం. నీ మనస్సు, నా మనస్సు అనేవేమీ లేవ్ (ఈ అర్ధం లో మనస్సనేది ఒక అవాస్తవం). ఒక తరం నుండి మరొక తరానికి అందింప బడుతున్న, మనిషి తెలుసుకున్న, అనుభూతి చెందిన, అనుభవించినవి

అన్నిటి మొత్తమే 'మనస్సు'. శ్వాస కొరకు వాతావరణాన్ని మనందరం ఏవిధంగా ఉమ్మడిగా వాడుకుంటున్నామో, అలాగే మనమందరం ఆ ఆలోచనా గోళంలో (thought sphere) ఆలోచిస్తున్నాం, పని చేస్తున్నాం.

- వాంఛారాహిత్యం సాధన చేయాలని నీకు చెప్పేరు. ముప్పై నలభై ఏళ్లు దాన్ని అభ్యాసం చేసావ్, కానీ ఇంకా కోరికలు ఉన్నాయ్. అందుచేత ఎక్కడో దేనిలోనో తప్పు ఉండి ఉండాలి. కోరిక అనేది తప్పు కానేరదు; ఆశారహితస్థితిని అభ్యాసం చెయ్యమని చెప్పిన వాడిలోనే ఏదో లోపం ఉండి తీరాలి. వాంఛ ఒక వాస్తవం; కోరికలులేని స్థితి అవాస్తవం – ఇది నిన్ను తప్పు దారి పట్టిస్తోంది. కోరిక వుంది. కోరిక కలగడం అనేది, మౌలికంగా తప్పుకాదు, అవాస్తవం కానేరదు, ఎందువలనంటే అది నిజంగా ఉన్నది కాబట్టి.
- మనిషి స్వభావం మౌలికంగా హింసాత్మకం, ఎందుకంటే ఆలోచన హింసాత్మకమైనది కాబట్టి. ఆలోచన నుండి పుట్టినవన్నీ విధ్వంసకరమైనవే. వీటిని అద్భుతమైన, అందమైన సమాసాలతో, వాక్యాలతో కప్పి కనమరుగు చెయ్యవచ్చు: 'నీవు నిన్ను ప్రేమించినట్టుగా నీ పొరుగు వారిని

ప్రేమించు.'-- దీని పేరు చెప్పుకొని, లక్షలకొద్దీ, కోట్లకొద్దీ ప్రజలు, (ఈ మధ్య కాలంలో జరిగిన యుద్ధాలన్నిటిలో మరణించిన వారి కంటే ఎక్కువ మంది,) చనిపోయారనే సంగతి మరచి పోవద్దు. కానీ, మానవుల సమస్యలకు హింస పరిష్కార మార్గం కాదని, తెలుసుకో గలిగే పరిస్థితికి మనం ఇప్పుడు వచ్చాం. అందువల్ల భయాన్ని సృష్టించడమే ఒకే మార్గంలా కనిపిస్తోంది? చర్చిల మీద గుళ్ల మీద తీవ్ర వాదులు బాంబులు వేయడం గురించి నేను మాట్లాడం లేదు, కానీ, 'నీవు నీ పొరుగు వాడిని నాశనం చేయడానికి ప్రయత్నిస్తే నిన్నునీవే నాశనం చేసుకొనే అవకాశం ఉంది,' అనే భయం గురించి మాట్లాడుతున్నాను. ఈ అవగాహన, సామాన్య మానవుడున్న మెట్టు వరకు దిగి రావాలి.

- పరిష్కారమే అసలు సమస్య. నీవు సృష్టించుకున్న అసత్య పరిష్కారమార్గాల వల్లే నీ సమస్యలు యింకా కొనసాగుతాయ్. జవాబులు లేనప్పుడు ప్రశ్నలు ఉండలేవు. ఇవి ఒక దానిపై ఒకటి ఆధారపడి వుంటాయ్. నీ సమస్యలు, పరిష్కారాలు ఎప్పుడూ కలిసే ఉంటాయ్. నీ సమస్యలు తీరడానికి కొన్ని జవాబులను ఉపయోగించాలనుకుంటావ్ కాబట్టి, ఆ

సమస్యలు కొనసాగుతూనే ఉంటాయ్. ఈ మత గురువులు, మానసిక శాస్త్రవేత్తలు, రాజకీయవేత్తలు మీకు చూపిన అనేక పరిష్కారాలు నిజమైన పరిష్కారలు కానేకావు. ఇది మనకి తెలుస్తూనేవుంది. ఇంకా గట్టిగా ప్రయత్నించండి, మరిన్ని మెడిటేషన్లు ప్రాక్టీస్ చెయ్యండి, నమ్రతను అలవరచుకోండి, తలకిందులుగా నుంచోండి అంటూ గట్టిగా నచ్చచెపుతారు. వాళ్ళింతకు మించి ఏమీచెయ్య లేరు. నీ అశలు, భయాలు, అమాయకత్వం పక్కకు నెట్టి వీళ్లందరినీ వ్యాపారులుగా చూడ గలిగితే, వాళ్ళిస్తానన్నవి యివ్వలేరని, ఎప్పటికీ యివ్వరని తెలుస్తుంది. కానీ నువ్వు మాత్రం యీ ప్రావీణ్యులు అమ్మజూపే నకిలీ సరుకులు కొంటూనే ఉంటావ్.

- ఒక వేదికపై కూర్చొని మాట్లాడ్డమనేది నేనెప్పటికి చేయలేను. అది మరీ కృత్రిమంగా ఉంటుంది. కూర్చుని అర్ధంకాని పదాలతో ఊహాజనితమైన విషయాలు మాట్టాడుకోడం సమయాన్ని వృధాచేయడమే. కోపమొచ్చిన మనిషి కూర్చుని, కోపాన్ని గురించి కబుర్లు చెప్పడు, ఉల్లాసంగా మాట్లాడడు; అతడు చాలా కోపంలో ఉంటాడు. అందుచేత నీవు కోపం అనే క్లిష్ట పరిస్తితిలో ఉన్నావని నాకు చెప్పకు. కోపాన్ని

గురించి మాట్లాడి ఏం ప్రయోజనం? 'ఏదో ఒకరోజున ఏదోవిధంగా కోప విముక్తుడను కాకపోతానా' అనే ఆశతో నువ్వు బ్రతుకుతావ్, అదే ఆశతో మరణిస్తావ్. ఈ ఆశల బరువులు మోసి మోసి యీ జన్మ నిరాశాజనకంగా కనిపిస్తే, నీవు తరవాత జన్మను కల్పన చేస్తావ్. జన్మలు లేవు, (మళ్ళీ) రాడానికి.

- నా ఉద్దేశ్యం యితరులు చెప్పింది తోసి పడేయడం కాదు (అది చాలా తేలిక పని!), నేను చెపుతున్నది తీసి పడేయడానికి. సరిగ్గా సంక్షింప్తంగా చెప్పాలంటే, నేను చెపుతున్న దాని నుండి మీరు తీస్తున్న అర్థాలను ఆపడానికి నేను ప్రయత్నిస్తున్నాను. ఇందువల్లనే నా మాటలు ఇతరులకు పరస్పర విరుద్ధంగా ఉన్నాయనిపిస్తాయ్. నేను చెప్పిన మొదటి మాట (స్టేట్ మెంట్) ను వెంటనే మరో మాట (స్టేట్ మెంట్) తో కాదంటాను. రెండో స్టేట్ మెంట్ ను మూడో స్టేట్ మెంట్ తో కాదంటాను; మీరు వినే విధానమే నన్నిలా మాట్లాడ్డానికి ప్రోద్బలం చేస్తోంది. నా లక్ష్యం, అందరికీ అనువైన తార్కిక వాదాన్ని ప్రతిపాదించడం కాదు, వ్యక్తం పరచగల వాటినన్నిటినీ కాదని పూర్తిగా తోసిపుచ్చడం.

ఆంగ్లమూలం:

http://www.ugkrishnamurti.net)

--------------------------------

# ఉన్నది ఉన్నట్టుగా అన్నది

# (Telling It Like It Is)

1. రక్షకుడు రచ్చ మిగిల్చి పోతాడు, యీ లోకంలో.

2. మతాలు గులాబీలిస్తానన్నాయ్, కానీ నీకు ముళ్లు మిగిలేయ్.

3. పబ్ కెళ్లడం, గుడికెళ్లడం రెండూ ఒకటే. సమస్యకి అదొక తక్షణ పరిష్కారం.

4. దేహానికి తనదైన అస్తిత్వం లేదు. నువ్వక్కడ ఓ కబ్జా దారుడివి.

5. దైవం, లైంగికం రెండూ కలిసే ఉంటాయ్. దేవుడు పోతే సెక్స్ గూడా పోతుంది.

6. అనుభవాలన్నీ, ఎంతటి గొప్పవైనా, అవి ఇంద్రియ సుఖాలే.

7. మనిషి తనలా కాక మరొకలా ఉండ లేడు. అతడెలా ఉన్నా.. తనని ప్రతిబింబించే సమాజాన్ని సృష్టిస్తాడు.

8. రాగ ద్వేషాలు వ్యతిరేక గుణాలు కావు. రెండూ ఒకటే. ఇవి ముద్దాడే ప్రేమికుల కంటే దగ్గరగా ఉంటాయ్.

9. గురువులు సామాజిక పాత్రను పోషిస్తారు. వ్యభిచారులూ అంతే.

10. జీజస్, బుద్ధుడు, కృష్ణుడు లాంటి వారిని మనం ఆదర్శంగా తీసుకోడం వల్ల, ప్రత్యేకమైన వ్యక్తులకు ప్రకృతి యిచ్చే అవకాశాన్ని మనం నాశనం చేశాం.

11. ఎలా నడచుకోవాలి, ఎలా జీవించాలి, ఎలా నిర్వహించాలి అనేది పిల్లలకు నేర్పించడానికి ప్రయత్నించడం కంటే, వాళ్ల నుండి మనం నేర్చుకోవడం ఎక్కువ ఆసక్తికరంగా ఉంటుంది.

12. నేను నీకు గేరంటీగా చెప్పగలిగేదేమంటే, నువ్వు సంతోషాన్ని వెతుకుతున్నంత కాలం నీవు అసంతుష్టుడు గానే వుండి పోతావని.

13. నువ్వు తినేది ఆహారం కాదు, అభిప్రాయాలు. ధరించేది దుస్తులు కాదు, పేర్లూ, లేబుల్సూ.

14. వాస్తవం ఏమిటంటే, నీకు సంస్యలేమీ లేనపుడు, ఏదో ఒక సమస్య సృష్టిస్తావ్. నీకే సమస్యా లేనపుడు ఇదీ ఒక జీవితమేనా అంటావ్.

15. చెత్త లాంటి ఆ మనసు విధ్వంసకరమైనవి  చాలా సృష్టించింది. వాటన్నిటిలో ఎక్కువ విధ్వంసకరమైనది  గాడ్, దేముడు.

16. వాతావరణ కాలుష్యం చాలా తక్కువ హానికారకం, ప్రపంచాన్ని ఎక్కువగా పీడించిన ఆధ్యాత్మిక మత కాలుష్యంతో పోలిస్తే.

17. ప్రకృతి అసలైన  అసాధారణ వ్యక్తులను సృంష్టించడంలో నిమగ్నమై ఉంది. సంస్కృతి మాత్రం అందరూ యిలాగే ఉండాలంటూ ఒకే ఒక మోడల్ సృష్టించింది. ఇది చాలా వికృతం.

*************

# నా చివరి పాట

## (Swan Song)

## (యు.జి.కృష్ణమూర్తి చివరి మాటలు)

*(లూయిస్ బ్రాలీ అనే ఆయనకు ఫిబ్రవరి 2007 లో, మరణించడానికి ఓ నెల ముందు, యూజీ డిక్టేట్ చేసినది)*

------------------

మనిషి ఆలోచనకు సంబంధించిన ఏ క్షేత్రంలోనైనా, నా అంతట నేను తెలుసుకున్నది, కనుక్కొన్నదీ, యింతవరకు ప్రతి ఒక్కరూ చెప్పిన ప్రతీదానికి వ్యతిరేకంగా వెడుతుంది. వీళ్ళందరూ తప్పుదారి పట్టేరు, ప్రతి ఒక్కరిని తప్పుదారి పట్టించేరు. ఇంతజరిగినా వాళ్ల మాయలో పడతావ్, ఎందుకంటే, ఒకవేళ నీవు తినే తిండిని మార్చవలసి వస్తే, ఆకలితో చచ్చి పోతావని నీ భయం! కానీ నేనెప్పటికీ జీవించి ఉండాలని కోరుకొంటున్నా! నేను నా జీవితంలో తొంభై సంవత్సరాలు జీవించిన విధంగా, సజీవంగా,

ఆరోగ్యంగా నన్ను నీవు ఉంచగలవా? లేవు కదా? కాని అదే నాకు కావలసింది!

మీ చెత్త సంస్కృతి అక్కడ చేర్చిన మురికినంతా శరీరం బయటకు నెట్టివేసినపుడు యీ దేహం అత్యద్భుతమైన రీతిలో పని చేస్తుంది. అది అన్నిటిని చక్కబెట్ట గలదు.

నేనెప్పుడైనా ఒక విషయం అంగీకరిస్తే, అది వైద్యశాస్త్ర నిపుణులు కనుగొన్నదాన్ని, మన శరీరం పనితీరు గురించి మతఛాందసులు నాకు చెప్పిన దాన్ని కాదు. అయినప్పటికీ వైద్యులకు కూడా తెలియనిది యింకా చాలా ఉంది; ఈ దేహం ఎలా పనిచేస్తోందో వారికెప్పటికీ తెలియదు.

నేనెప్పుడూ ఏ మందులూ వాడలేదు, ఎప్పుడూ ఏ డాక్టర్నీ సంప్రదించలేదు. నేను జీవించే విధానం సరియైనది కాదని నాకు సలహా ఇచ్చిన వైద్యులంతా కన్నుమూసేరు, వారు యిపుడిక లేరు. కానీ దీనికొక మినహాయింపు ఉంది -- ఒక సారి నేను మద్రాస్ లో ఉండగా నాకు టైఫాయిడ్ జ్వరం వచ్చింది. ఆ టైమ్ లో మద్రాసు ప్రభుత్వాసుపత్రిలో నా భార్య సోదరుడు ఓ పెద్ద డాక్టరు. ఆ హాస్పిటల్ లో బ్రిటీషు వారికై ఓ ప్రత్యేక విభాగం ఉంది, వాటి లోని గదుల్లోకి మరెవ్వరినీ అనుమతించే వారు కాదు. అయినప్పటికి ఆ సంవత్సరం

సామాన్య ప్రజలకు కూడా ఆ విభాగంలోని గదులిచ్చారు. అందుచేత నా బావమరిది రెండు రూములు తీసుకున్నాడు, ఒకటి నాకు, మరొక రూములో నా భార్య & అమ్మమ్మ ఉన్నారు. ముగ్గురు నర్సులు ఎనిమిది గంటలకొకరు చొప్పున, ఒక నెల రోజుల పాటు నన్ను జాగ్రత్తగా చూసుకొన్నారు. తర్వాత నేను హాస్పటల్ నుండి బయట పడ్డాను.

వైద్యులనందర్నీ కాల్చి పారెయ్యాలని నేను అన్నప్పటికీ, డాక్టర్స్ దగ్గరికి వెళ్లద్దని యితరులకు నేను సలహా ఇవ్వను. ప్రాణాన్ని మరో కొంత కాలం పొడిగించుకోవలసిన పరిస్తితి నాకు వచ్చినప్పుడు నేనేంచేస్తానో నాకు తెలియదు. అందుచేత డాక్టర్ని సంప్రదిచవద్దని ఎవ్వరికీ ఎప్పుడూ సలహా యివ్వను.

మనిషి ఆలోచనల నుండి పుట్టిన ప్రతీ దాన్నీ నేను తోసిపుచ్చాను. వాళ్లు చెప్పినవన్నీ నన్ను తప్పుదారిలో నడిపించేయ్. నువ్వు దేని కొరకు ప్రయత్నిస్తున్నావో అది నీవెప్పటికీ పొందలేవు, ఎందువలనంటే పొందడానికి ఏమీ లేదు.

నీ గురించి నీవు ఏమనుకుంటున్నావో అది ఒక నమ్మకం. నీవు ఒక నమ్మకాన్ని వదిలేస్తే దాని స్తానంలో మరొక నమ్మకాన్ని పెట్టాల్సిందే; అలా చెయ్యక పోతే వెంటనే మరణిస్తావ్. నేను

చెప్తున్నా, నీకు నిజంగా వైద్యులు చెప్పే ఒక భౌతిక మరణం సంభవిస్తుంది. అది, ఆ ద్రోహులు చెప్పిన `వాళ్ళ యొక్క చావుకి దగ్గరగా వెళ్లిన అనుభవం` కాదు.

అందుచేత, నీవు చక్కగా డబ్బు సంపాదించి, ఆ డబ్బుతో వచ్చిన సుఖాలన్నీ అనుభవించడం మంచిది.

ఆ చెత్త మత ధార్మికులందరూ తమను తామే మోసం చేసుకుంటున్నారు, ప్రతి ఒక్కరినీ మోసం చేస్తున్నారు, అబద్ధపు మాటలు అమ్మి, నెరవేర్చలేని వాగ్దానాలు చేసి ప్రజల అమాయకత్వాన్నీ నమ్మకాన్నీ సొమ్ము చేసుకొని బతుకుతున్నారు. అయినా మీరు, ఆ అవాస్తవాలన్నీ నమ్ముతారు మీ ముందుంచిన ఆ చెత్తను చూసి మీరు మోసపోయేరంటే - అది మీ తెలివికి ప్రతిబింబం.

మిమ్మల్నీ, యీ లోకాన్నీ రక్షించమని నాకెవ్వరూ ఆజ్ఞ, ఆదేశం యివ్వలేదు. ఈ భూమి మీదున్న యితర ప్రాణులకు అది చేసిన అన్యాయానికి, యీ మానవ జాతినంతటని ఈ భూమి నుండి తుడిచి పారెయ్యాలి! దీనికిక్కడ స్తానం లేదు. నాకు ఖచ్చితంగా తెలిసినది ఏదైనా ఒకటుంటే, అది యిదే. మీ విధ్వంసక ఆయుధాలు మీ దగ్గర లేకపోతే, మీరందరూ ఎప్పుడో తుడుచుపెట్టుకు

పోయేవారు. అంతే కాదు, యిప్పుడు ఇతరుల వద్ద గూడా మిమ్మల్ని నాశనం చేసే సాధనాలు ఉన్నందువల్ల, మీరందరూ కూడా తుడిచుపెట్టుకుపోక తప్పదు. కానీ, ఈ గ్రహం మీదున్న అన్ని రకాల ప్రాణులను గూడా మీతో తీసుకొనిపోకుండా, గౌరవప్రదంగా మీరు వెళ్ళలేరు.

అతి చిన్న సాధనంతో మీరు అతి పెద్ద శక్తిని నాశనం చెయ్యొచ్చు.

తాను జీవించి ఉండడానికి తాను ఏంచెయ్యాలో అన్నది దేహానికి తెలుసు. జీవించి ఉండడానికి కావలసిన సాధనాలు దాని దగ్గర లేనపుడు అది గౌరవప్రదంగా ప్రాణం విడుస్తుంది. ఈ భూమి మీద యీ జీవి ఉండడానికి ఒకే ఒక కారణం, మానవ జాతిని కొనసాగించడం. సెక్స్, లైంగిక కార్యం పునరుత్పత్తి కొరకే, తన లాంటి మరో జీవిని పుట్టించడానికే. కాని నీవు దీన్ని సుఖ లాలసగా మార్చేసేవ్. పునరుత్పత్తికి కాక మరెందుకీ సెక్స్?

మానవజాతి యీ గ్రహం మీదకు వచ్చింది, తర్వాత ఈ సృష్టంతా తనకోసమే అనుకొంటోంది. నువ్వేదో ఓ గొప్ప మంచి ఉద్దేశ్యం కొరకు సృష్టింపబడ్డావని నువ్వనుకుంటావ్. మనిషి, ఈ భూమి మీదున్న అన్ని యితర జీవరాసుల కంటే తుచ్ఛమైన జీవి.

నీవొక మృగానివి మాత్రమే, కానీ దీన్ని ఒప్పుకోవడాని నువ్వు సిద్ధంగా లేవు. నీవు ఇతర జంతువుల కంటే ఎక్కువ తెలివైనవాడవు కావు.

మానవ దేహం యొక్క స్వాభావిక ప్రజ్ఞ (native intelligence) అత్యద్భుతమైనది. జీవితంలో తారసపడే ఏ అపాయకర పరిస్థితి నైనా తట్టుకొని బతకడానికి దీనికి కావలసినదంతా యిదే.

నీకు పుట్టుకతోపాటు వచ్చినదే నీలోఉన్న యీ స్వభావిక ప్రజ్ఞ. వీళ్లంతాచేసే బోధన నుండి నీవు ఆర్జించినదే బుద్ధి (intellect). నీ సొంతం అని చెప్పుకోగలిగే ఏ పదాలుగానీ, ఏ మాటలుగానీ, ఇంకా ఏ అనుభవాలుగానీ, నీ దగ్గర లేవు. నువ్వేది అనుభవించాలన్నా నీలో పెట్టబడిన ఆ జ్ఞానాన్ని నీవు ఉపయోగించి తీరాలి.

నీ ప్రేమలో ఏమీ లేదు, నీవాశించినది నీకు దొరకనప్పుడు నీ ప్రియమైన కబుర్లు ఏమవుతాయ్, 'మై డార్లింగ్, స్వీటీ, చిలకా, బంగారం, వగైరా... నువ్వు కోరుకున్నవి నీ ప్రేమలో దొరకనప్పుడు, నీ స్వీటీ, గీటీకి ఏమవుతుంది?

నా దగ్గరున్న ఒకే పరీక్ష, ఒకే టెస్ట్ -- డబ్బు. నీ డబ్బునుండి నీవు ఎంత వరకు విముక్తుడవు కాగలుతున్నావ్? నేనంటున్నది

“నీవు డబ్బును ఎంత వృధాగా ఖర్చు పెట్టగలుగుతున్నావు?” అనికాదు.

అంతా తుడుచుపెట్టుకొని పోయినా నేను పోగొట్టుకొనేది లేదు, అది అలాగే ఉండిపోయినా నాకు లాభించేదేమీ లేదు.

ఈ లోకంలో ఎవరితోనైనా నీకున్న ఒకే ఒక సంబంధం, “దాని నుండి నాకేం దొరుకుతుంది?” అనేది. అదొక్కటే నువ్వు జాగ్రత్తగా చూసుకొనేది. అంతకు మించి దాంట్లో ఏమీ లేదు!

నా చుట్టూ తిరిగితే మీకేదో దొరుకుతుందనుకొని మిమ్మల్ని మీరు ఫూల్ చేసుకొంటున్నారు.... మీకెలా చెప్పాలి! నిజంగా మీకేదీ దొరకదు, ఎందుకంటే ఎవరినుండీ ఏదీ మీరు పొందాల్సిన అవసరం లేదు.

నన్ను మీరు ఎటువంటి మతపరమైన చట్రంలోనూ ఇమడ్చలేరు. ప్రజల అవివేకాన్ని, నమ్మకాన్నిఆసరాగా తీసుకొని ఎదగాల్సిన అవసరం నాకు లేదు. అలా నేనెందుకు చెయ్యాలి? నేను చెప్తున్నా, మీరన్నిటినీ పోగొట్టుకుంటారు! మీకెవ్వరి దగ్గర నుండి ఏమీ దొరకదు. మీరు కోరుకునేది మరెవ్వరి దగ్గరనుండి కూడా దొరకదని చెప్పాల్సిన అవసరం నాకు లేదు. ఈ విషయం నీ అంతట నీవే కనుక్కుంటావ్. కానీ అది, నీ ప్రయత్నం వల్ల గాని, నీ

సంకల్పం వల్ల గాని, ఏదో చేయడం వల్లగాని, ఏమీ చేయకపోవడం వల్లగాని, జరగదు. అది కార్య-కారణ క్షేత్రంలో (field of cause and effect) సంభవించేది కాదు.

ప్రతీది నా దేహం నుండి బయటకు తోసివెయ్యబడింది. ఈ రంగుల రాట్నం నుండి నేనెలా నెట్టివేయబడ్డానో నాకు తెలియదు. నేను అన్నిటిచుట్టూ తిరుగుతూ ఉండే వాణ్ని. నేను అదృష్టవంతుణ్ణి ~ అదృష్టం అంటే జూదం ఆడినపుడు అదృష్టం వల్ల గెలవడం కాదు. వాళ్లు నన్ను రంగుల రాట్నం ఎక్కించారు; నేను దానిపై తిరుగుతూనే ఉండే వాణ్ని. కిందకు దూకకెయ్యడానికి ధైర్యం చాలలేదు. ఒక్కసారిగా తోసివేయ బడ్డాను, ఓ జంతువుని చెట్టు పైనుండి విసిరేసినట్టు. అంతే, ఆ జంతువు వెంటనే లేచి పరుగెత్తుకు పోయింది!

భయం నీ శరీరాన్ని బిరుసుగా గట్టిగా చేస్తుంది, అపుడు నీ అవయవాలను తప్పనిసరిగా విరగ గొట్టు కుంటావ్. నా శరీరం ఎప్పుడూ బిరుసుగా ఉండదు.

శాశ్వతత్వం కావాలనే గట్టి కోరికే మనిషి కష్టాలకు కారణం -- శాశ్వత అనుబంధం, శాశ్వత సంతోషం, శాశ్వత పరమానం, ఏదైనా,

మానవ జీవనం లోని ఏ క్షేత్రంలో అయినా. శాశ్వతంగా ఉండడం అనేది ఏదీ లేదు.

అందు చేత పనికిరాని మూర్ఖుడిగా ఉండద్దు! వెళ్లి డబ్బు సంపాదించుకోండి. అదొక్కటే మీపై నాకు మంచి అభిప్రాయాన్ని కలగజేస్తుంది. డబ్బిచ్చి కొనుక్కోండి (cash on the barrel, పీపా మీద డబ్బు పెట్టి, పీపా తీసుకెళ్లండి!). యీ విషయం అతి చిన్న వయసు లోనే నేను మా అమ్మమ్మ, తాత గార్లకు చెప్పేను.

యీ లోకానికి తగ్గట్టుగా, సరిపోయేట్టుగా నేను యీ లోకంతో కలసి నడుస్తున్నాను, అది ఎలా ఉందో పూర్తిగా అదే విధంగా.

నేనెప్పుడూ చట్టానికి వ్యతిరేకంగా నడచుకోను, చట్టాలు ఎంత అధ్వాన్నంగా ఉన్నప్పటికీ.

బెర్ట్రేండ్ రస్సెల్ (Bertrand Russell) తో అన్నాను, "హైడ్రోజన్ బాంబు మీ పోలీసు వాడికి ఒక పొడిగింపే (extension), పోలీసులను తీసివేయడానికి మీరు అంగీకరిస్తారా?" అని. "ఎక్కడో ఒక చోట హద్దు పెట్టక తప్పదు." అన్నాడాయన. నేను గుడ్ బై చెప్పి వచ్చేసేను.

ఈ ప్రపంచాన్ని మార్చాల్సిన అవసరం ఏమాత్రం లేదు; నిన్ను మార్చుకోవలసిన అవసరం గూడా లేదు.

అందరితో కలసిమెలసి తిరిగే రకం కాదు నేను; అయినప్పటికీ సంఘు విద్రోహిని కూడా కాదు.

నేను మాటి మాటికి నొక్కి చెప్పడానికి ప్రయత్నించేదేమంటే, నాకు జరిగింది, వాళ్లు భోధించే అర్ధంపర్ధం లేని ఆధ్యాత్మికతకు సంబంధించినది కాదు. నాకు జరిగిన దాంట్లో ఆధ్యాత్మిక విషయం అణువంత గూడా లేదు. ఇది ఒక స్వచ్ఛమైన సాధారణ భౌతిక సంఘటన (సింపుల్ ఆండ్ ప్యూర్ భౌతిక విషయం). ఆధ్యాత్మిక గురువులు, మత సామరస్య లౌకిక వాదులు, శాస్త్రవేత్తలు మరియు వైద్యపరమైన సాంకేతికత బిగించిన ఉరితాళ్ల పట్టు నుండి, ఒక్కసారి ఈ దేహం విముక్తి పొందితే, యీ శరీరం అతి సమర్ధవంతంగా తన పని తాను చేసుకొంటూ పోతుంది.

నేను పుట్టినప్పుడు మా అమ్మ "నేను నీ అమ్మనురా" అని తనను నాకు పరిచయం చేసుకొని నన్ను హత్తుకొని ముద్దాడి నపుడు, నేను ఆమెను కాళ్ళతో తన్నేనుట; నేను పుట్టిన ఏడు రోజుల తర్వాత ఆమె చనిపోయింది. వాళ్లు నన్ను ఆత్మజ్ఞాని అనే చట్రంలో బిగించినపుడు వాళ్లు అన్నారు -- అటువంటిబిడ్డను కన్న తల్లి యికపై పిల్లలను కనలేదనీ, లైంగిక సుఖాలకు పనికి రాదని, ఆమె చని పోతుందనీ. నిజం ఏమిటంటే, ఆమె పురిటికి సంబందించిన

జ్వరం వల్ల చనిపోయింది, అంతేకాని ఒక జ్ఞానిని కన్నందువల్ల కాదు. వాళ్లు మా అమ్మ లాంటి వాళ్ళను 'జ్ఞానిని కన్నతల్లి' అనే చట్రంలో బిగించక తప్పదు.

ఒక ఆత్మజ్ఞాని లైంగిక కార్యం చేయలేడు ఎందువలనంటే అతను తన లాంటి మరొకరిని పుట్టించ లేడు. ఒక సారి ఒక టివి ఇంటర్వ్యూ చేసే ఆయన నన్నడిగేడు, "మీ వీర్యాన్ని ఉపయోగించి మరొక స్త్రీని గర్భిణిని చెయ్య లేమా?" అని. వీర్యం యింకేమీ లేదని చెప్పేను. ఆనందమయికి, ఆమెకు ఏదైతే జరిగిందో దానివల్ల యిరవయ్యొక్క ఏళ్లకే ఆమెకు పిరియడ్స్ ఆగి పోయాయ్. ఆవిడొక మంచి మహిళ. ఆమె నిజాయితీకి ఒక తార్కాణం, She was a genuine article.

నీ పుట్టుక నీ చేతుల్లో లేదు. నీ తలితండ్రుల లైంగిక క్రియ వల్ల నీవు యిక్కడ ఉన్నావ్. కానీ నేను ఇప్పుడు చెప్పగలను - నీ మరణం నీ చేతుల్లో ఉందని.

బాధలు అనుభవిచడంలో ఏమీ అర్ధం లేదు, పరమార్ధం లేదు.

ఒక శరీరం అదృష్టవశాత్తూ పొరపాటున తన సహజరీతిలో పనిచేయడం మొదలుపెడితే, అది జరగడానికి కారణం నీ కృషి, నీ సంకల్పం కాదు; అది అలా జరుగుతుందంతే, నువ్వేదో చేయడం

వల్లా కాదు,  ఏమీ చేయకపోవడం వల్లా కాదు. ఇది, కార్యకారణ సంబంధిత క్షేత్ర పరిధిలో గూడా జరిగిన ఘటన కూడా కాదు. `అకారణం (కారణం లేనిది)` అనేదే దీనికి సరియైన మంచి పదం. ఎందుకంటే ఒక 'ఘటన' కార్యకారణ క్షేత్రానికి (field of cause and effect) వెలుపల ఎప్పుడూ ఉండదు.

ఒకవేళ యీ దేహం తనంతట తానే యీ స్తితి లోకి పడ్డట్టయితే, అటు వంటి శరీరం ఎంత ప్రత్యేకమైనదిగా ఉంటుందంటే దీనితో సమానమైనది యీ ప్రపంచంలో మరేదీ ఉండదు, అంతేగాక ఇటువంటి దేహం అత్యద్భుతంగా అసాధారణ రీతిలో పని చేసుకొంటూ పోతుంది. అటువంటి వంటి దేహం ఇంతకు ముందెన్నడూ యీ భూమి మీద ఉండి ఉండదు.

నీవు నా మాటలు నమ్మవలసిన  పనిలేదు. బాధ పడుతూనే ఉండు, ఆ  బాధ లోనే మరణించు.

అటువంటి మనిషి, తాము ఆధ్యాత్మికులమని చెప్పుకునే చాలా మంది కంటే ఎక్కువ ఆధ్యాత్మికంగా  ఉంటాడు, కానీ `ఆధ్యాత్మికం` అనేదానికి సాధారణంగా అందరూ ఇచ్చే అర్థంలో కాదు -- ఆ పనికిరాని  అర్థాన్ని ఎప్పుడూ  తీసుకోకూడదు. ఆత్మ (spirit)

అనేది, “తుది శ్వాస విడిచేడు” లో వున్న శ్వాస మాత్రమే; యీ పదానికి ఆధ్యాత్మిక చెత్తతో ఏమీ సంబంధం లేదు.

...Vallecrosia, ఇటలీ

ఫిబ్రవరి 2007

**---- సమాప్తం ----**



మానవ దేహం యొక్క స్వాభావిక ప్రజ్ఞ (native intelligence) అత్యద్భుతమైనది. జీవితంలో తారసపడే ఏ అపాయకర పరిస్థితి నైనా తట్టుకొని బతకడానికి దీనికి కావలసినదంతా యిదే. నీకు పుట్టుకతో పాటు వచ్చినదే నీలోఉన్న యీ స్వభావిక ప్రజ్ఞ. వీళ్లంతా చేసే బోధన నుండి సమకూర్చుకున్నది బుద్ధి (intellect). నీ పాండిత్యం గాని, నీ అనుభవం కానీ ఏదీ నీది కాదు. నీదని చెప్పుకొనేవి ఏమీ నీ దగ్గర లేవు. నీ అనుభూతి లోకి, అనుభవం లోకి ఏది రావాలన్నా నీవు నేర్చుకున్న ఆ జ్ఞానాన్ని నీవు ఉపయోగించి తీరాలి.

ప్రతీది నా దేహం నుండి బయటకు తోసివెయ్యబడింది. ఈ రంగుల రాట్నం నుండి నేనెలా నెట్టివేయబడ్డానో నాకు తెలియదు. నేను అన్నిటిచుట్టూ తిరుగుతూ ఉండే వాణ్ని. నేను అదృష్టవంతుణ్ణి ~ అదృష్టం అంటే జూదం ఆడినపుడు అదృష్టం వల్ల గెలవడం కాదు. వాళ్లు నన్ను రంగుల రాట్నం ఎక్కించారు; నేను దానిపై తిరుగుతూనే ఉండే వాణ్ని. కిందకు దూకకెయ్యడానికి ధైర్యం చాలలేదు. ఒక్కసారిగా తోసివేయ బడ్డాను, ఓ జంతువుని చెట్టు పైనుండి విసిరేసినట్టు. అంతే, ఆ జంతువు వెంటనే లేచి పరుగెత్తుకు పోయింది!

-----------------

# అనువాదకుని మాట



"యు. జి. కృష్ణమూర్తి గారి గురించి" అనే యీ చిన్ని పుస్తకం ఇంటర్నెట్ వెబ్ సైట్ www.ugkrishnamurti.net లో పెట్టబడిన "About U.G. Krishnamurti" అనే దానికి నా తెలుగు అనువాదం. జిడ్డు కృష్ణ మూర్తి గారు చెప్పే 'అది' (the other) యూజీ కృష్ణమూర్తి గారు మాట్లాడే 'సహజస్తితి' (Natural State) ఏమిటి? అవి తెలుసుకోబడేవి కావని అంటారు వీరిద్దరు. ఆ స్తితిలో ఉన్న వీరు గూడా తమ స్తితి గురించి ఏమీ తెలియ జేయలేమని అంటారు. వాటి గురించిన ఒక చిన్న అనుభూతిని మనకు యివ్వడానికి, కొంతవరకు బహుశా ఇద్దరూ ప్రత్నించారు. మానవ జీవన విధానంలో ఆలోచన

యొక్క పాత్ర, దాని ప్రాధాన్యత విషయంలో వారిద్దరు మాట్లాడేదాంట్లో కొంతవరకు సామ్యత ఉన్నట్టుగా అనిపిస్తుంది. కానీ చెప్పే విధానంలో మాత్రం పోలిక లేదు. జిడ్డు కృష్ణమూర్తి గారి మాటలు స్పష్టంగా సరళంగా ఉండి ఒక సెలయేరుని తలపిస్తే, యు.జి. కృష్ణమూర్తి గారు చెప్పే మాటలు మాత్రం ఎగిసిపడే సముద్ర కెరటాల్లా జడిపిస్తాయ్. ఆయన మాటలలో భావాలు ఎంత స్పష్టంగా ఉంటాయో, మాటల కూర్పులో అంత గమ్మత్తు కనిపిస్తుంది. కానీ యూజీ మాట్లాడే విధానం మాత్రం... డిఫరెంట్, ఇంట్రస్టింగ్, అండ్ Amazing! యూజీ గూడా మానవ పరిణామక్రమంలో, ఇరవయ్యో శతాబ్దపు అధ్యాత్మిక, తాత్విక జ్ఞాన జగత్తులోకి, (యుజీ మాటల్లో చెపితే) ప్రకృతి విసిరిన ఒక అరుదైన పుష్పం! ఒక అద్భుత సృష్టి!

... జె. యస్. సుబ్రహ్మణ్యం. 9440724540,

josyulass4@yahoo.com

----------------